
కారు, హస్తం ప్రచార పర్వం..
సందిగ్ధంలో కమలదళం



- ఇంకా ఖరారు కాని బీజేపీ అభ్యర్థి
- పార్టీ పెద్దల చుట్టూ ఆశావహుల చక్కర్లు
- ప్రచారం ఎప్పుడంటున్న కార్యకర్తలు

సనత్‌నగర్: సనత్‌నగర్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం వేడెక్కుతోంది. అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమా తమదైన శైలిలో ప్రచారంతో దూసుకెళ్తుండగా బీజేపీ మొదటి జాబితాలో సనత్‌నగర్ అభ్యర్థి పేరు ఖరారు కాకపోవడంతో ఆశావహులు ఇంకా టికెట్ వేటలోనే ఉన్నారు. దీంతో ఆ పార్టీ ఇంకా ప్రచార పర్వం ప్రారంభించకపోగా టికెట్ ఎవరికి దక్కుతుందోనని ఆ పార్టీ కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరికి వారు ప్రచార అస్త్రాలను సిద్ధం చేసుకుని ప్రజల్లోకి వెళ్తున్నారు. దసరా, బతుకమ్మ, దాండియా వేడుకలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఇంకోవైపు యువజన సంఘాలు, కాలనీ సంక్షేమ, కుల సంఘాలు, మత పెద్దలను కలుస్తూ ఆయా సంఘాల ప్రతినిధుల ద్వారా ఓట్లకు గాలం వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇక ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలకు ఎరవేసి తమ పార్టీల్లోకి చేర్చుకునే ప్రక్రియ ఊపందుకుంది. ఇతర పార్టీల నుంచి నేతలను చేర్చుకోవడం ద్వారా ఆ పార్టీ నేతల్లో మనోనిబ్బరాన్ని దెబ్బతీసేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమ మంత్రంతో మంత్రి..

ఎన్నికల ప్రచారంలో భాగంగా రోజుకొక డివిజన్‌లో కొన్ని ప్రాంతాలను ఎంచుకుని పాదయాత్ర చేస్తున్నారు. ఇప్పటికే ఐదు డివిజన్లను చుట్టేసిన మంత్రి ఆయా ప్రాంతాల్లో ఇంటింటి పాదయాత్ర చేస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయాలను ప్రజల ముందుంచి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఓట్లు అడుగుతున్నారు. గత పాలకులు చేయలేని దీర్ఘకాలిక పనులను కూడా తాను చేసి చూపించానంటూ వెళ్లిన ప్రతిచోట చెబుతూ ఓటర్ల కటాక్షం మరోసారి పొందేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరుతున్నారు.

అభయ'హస్తం'తో నీలిమా..

ఇప్పటికే అభయహస్తం పేరుతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలుచేసే ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు విస్తృత ప్రచారం చేశారు. ఆమెకు టికెట్ ఖరారుకు ముందు ఇవే ఆరు గ్యారెంటీ పథకాలపై డాక్టర్ రవీందర్‌గౌడ్, మర్రి ఆదిత్యారెడ్డి సైతం వేర్వేరుగా ప్రచారం చేసి ప్రజల చూపు కాంగ్రెస్ వైపు మళ్లించే ప్రయత్నం చేస్తూ వచ్చారు. కోట నీలిమాకు టికెట్ ఖరారు అయ్యాక ప్రచారంలో మరింత ఊపు పెంచారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని డివిజన్లను కవర్ చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటి అభయహస్తం రెండో దశ కింద ప్రచారం ఆరంభించారు.

ఇంకా మేల్కోని బీజేపీ..

బీజేపీ నేతల ఎన్నికల ప్రచారం ఇంకా ప్రారంభమే కాలేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ప్రచారం కొనసాగిస్తుంటే బీజేపీ నేతలు మాత్రం టికెట్ ఎవరికి దక్కుతుందోనని ఎదురుచూపులు చూడడంతోనే సరిపోతోంది. ఆ పార్టీ నుంచి అరడజను మంది నేతలు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తుండగా చివరకు ఎవరు టికెట్ దక్కించుకుంటారో అని ఉత్కంఠ ఆ పార్టీ నేతల్లో నెలకొంది. ఎప్పుడు అభ్యర్థిని ప్రకటిస్తారు.. ఇంకెప్పుడు ప్రచారపర్వాన్ని కొనసాగిస్తారోనని కార్యకర్తలు ఎదురు చేస్తున్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు 39



వివరాలు వెల్లడిస్తున్న కిషన్‌రావు, శంకర్

సనత్‌నగర్: నియోజకవర్గంలో 39 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను అధికారులు గుర్తించారు. ఆయా పోలింగ్ బూత్‌లు 12 భవనాల్లో (లొకేషన్స్) ఉన్నాయి. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కిషన్‌రావు, అసిస్టెంట్ ఆర్వో శంకర్ వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో 100 భవనాల్లో మొత్తం 229 పోలింగ్ బూత్‌లు ఉండగా వాటిలో క్లిష్ట, అతి క్లిష్టమైనవిగా గుర్తించి 39 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల నాటికి భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. నోడల్ అధికారి పర్యవేక్షణలో అతి క్లిష్టమైన బూత్‌లు కలిగిన భవనాల వద్ద ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఆరు కేంద్ర సాయుధ బలగాల సిబ్బందిని నియమించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. క్లిష్టమైన పోలింగ్ బూత్‌ల వద్ద హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్, ఇంకో హోంగార్డు ప్రత్యేకంగా విధులు నిర్వహించనున్నారు.

సమస్యాత్మక బూత్‌లు ఇవే..

మోండా మార్కెట్ ఇస్లామియా బాలుర హైస్కూల్ భవనం, పద్మారావునగర్ సర్దార్‌పటేల్ కాలేజ్, న్యూబోయిగూడ గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీ హాల్, న్యూబోయిగూడలోని సెయింట్ ఫిలోమియా హైస్కూల్, నల్లగుట్టలోని జియా–ఉల్–ఇస్లాం హై స్కూల్, ఓల్డ్ నల్లగుట్టలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, మహంకాళి స్ట్రీట్‌లోని ఉజ్జయినీ మహంకాళి టెంపుల్ సమీపంలోని ఆదయ్య మెమోరియల్ హైస్కూల్, బీకేగూడ రవీంద్రనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, బాపునగర్ కమ్యూనిటీ హాల్, బేగంపేట పాటిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, బ్రాహ్మణవాడీ గీతాంజలి స్కూల్, సనత్‌నగర్ అశోక్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఆయా పోలింగ్ స్టేషన్లు బేగంపేట (2 పోలింగ్ కేంద్రాలు), గాంధీనగర్ (2), మహంకాళి పీఎస్ (1), మార్కెట్ పీఎస్ (1), చిలకలగూడ (1), రాంగోపాల్‌పేట్ (2), సనత్‌నగర్ (1), ఎస్ఆర్‌నగర్ (2) పోలీస్‌స్టేషన్లలో విస్తరించి ఉన్నాయి.

డీఆర్‌సీ కేంద్రంగా ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల

సనత్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి డీఆర్‌సీ (డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్)గా ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలను ఎంపిక చేశారు. ఇక్కడ ఎన్నికల సామగ్రిని భద్రపరిచి పోలింగ్‌కు ఒక రోజు ముందు ఇక్కడి నుంచే నియోజకవర్గంలోని 229 పోలింగ్ స్టేషన్ల సిబ్బందికి పంపిణీ చేయనున్నారు. అందుకోసం నియోజకవర్గ పరిధిని 23 రెవెన్యూ రూట్లుగా విభజించారు. ప్రతి రెవెన్యూ రూట్‌లో ఒక సెక్టార్ అధికారి పర్యవేక్షణలో పోలీసు భద్రత ఉంటుంది. అదేవిధంగా నియోజకవర్గంలో చేరే ప్రాంతాల్లో మూడు ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు పెద్దపీట


ప్రచారంలో పాల్గొన్న లాస్యనందిత

జంగ్ 2023 తెలంగాణ

రసూల్‌పురా: సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత పేర్కొన్నారు. మూడవ వార్డు బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం కార్ఖాన మహంకాళి ఆలయంలో పూజలు చేసిన అనంతరం చర్చిగల్లి, ముస్లింబస్తీ, కింది బస్తీ, మీదిబస్తీ, మసీద్ వెనుక గల్లీ తహారా ఆపా గల్లీ ఇతర బస్తీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వంలోని గులాబీ పార్టీకి మరోసారి మద్దతు పలకాలన్నారు.

- ఆయా ప్రాంతాల్లో కొనసాగిన పాదయాత్రకు స్థానికులు మంగళహారతులు ఇస్తూ తిలకం దిద్దుతూ స్వాగతం పలికారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న తమ సమస్యలు పరిష్కరించారని ఆయనకు మద్దతుగా ఉన్నట్లే లాస్యకూ మద్దతు ఉంటామని స్థానికులు హామీ ఇచ్చారు. ప్రచారంలో నివేదిత, నళిని కిరణ్, అనిల్, మహ్మద్ అఖ్తర్, శ్రీనివాస్, చిన్నా, పరశురాం, సాంబ అశోక్. జామీయ మజీద్ ప్రసిడెంట్ మీర్జా, మైనార్టీ అధ్యక్షులు అహ్మద్, వలి ఉల్లాఖాన్ , జావీద్, గౌరి, ఆరీఫ్, ఆసీఫా, ఆసియా, పర్వీన్ ఉన్నారు

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన


బొడ్రాయికి పూజలు చేస్తున్న మంత్రి తలసాని

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావు నగర్ హమాల్‌బస్తీలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాలలో నుంచి భారీగా తరలి వచ్చిన ప్రజలతో హమాల్‌బస్తీ ప్రాంతం కోలాహలంగా మారింది. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, పవన్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు నాగులూరి సాయిబాబా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల కోరిక మేరకు ఇక్కడ బొడ్రాయిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గురువారం బస్తీ వాసులు పెద్ద ఎత్తున బొడ్రాయి వద్ద బోనాలు సమర్పిస్తారన్నారు. పండుగలన్నీ ప్రజలందరూ ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య గడపడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హేమలత, రాసూరి సునీత రమేష్, తలసాని సాయి కిరణ్ యాదవ్, టి. కిషోర్ కుమార్ గౌడ్, వెంకటేషన్, సుభాష్, యాదగిరి, అంజయ్య, సత్యనారాయణ, ఫొటో నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



లాలాపేట: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జగన్‌మోహన్‌రావును బుధవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, మోతే శోభన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సెల్‌ఫోన్ స్నాచింగ్‌ను ఛేదించిన పోలీసులకు రివార్డులు


నగదు పురస్కారాన్ని అందుకుంటున్న కానిస్టేబుల్, హోంగార్డు

లాలాపేట: ఓ వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతుండగా ఫోన్‌ను లాక్కొని పారిపోతున్న దుండగులను పోలీసులు పట్టుకున్న సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ నెల 24న రాత్రి 11.30 లకు అన్సూయాదవ్ అనే వ్యక్తి తార్నాకలోని కొండపొచమ్మ వైన్స్ వద్ద సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా షేక్ అఫ్సర్(23), తుడం మహేశ్ (19) అతని వద్దకు వెళ్లి సికింద్రాబాద్‌కు ఎలా వెళ్లాలని అడిగి సెల్‌ఫోన్‌ను లాక్కొని పారిపోతుండగా అక్కడే పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ నరేష్, హోంగార్డు ప్రమోద్ వారిని అడ్డుకుని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. మొబైల్ స్నాచింగ్ నిందితులను పట్టుకున్న నరేష్, ఎం.ప్రమోద్‌కుమార్‌ను అభినందిస్తూ నగర కమిషనర్ ప్రకటించిన నగదు రివార్డును బుధవారం ఈస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్ దత్ అందజేశారు.

క్రైం కార్నర్..

బాలుడి అదృశ్యం


శివాజీ

సనత్‌నగర్: బాలుడు అదృశ్యమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణగౌడ్ వివరాల ప్రకారం.. మోతీనగర్ రామారావునగర్‌కు చెందిన శివాజీ (15) ఈ నెల 22న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 9490617132, 94906 18445 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై నిలిచిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కిన 45 ఏళ్ల వయసున్న వ్యక్తి కాసేపటికే బోగీలోనే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సదరు వ్యక్తిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే మృతి చెందాడు. మృతుడి వద్ద టికెట్, గుర్తింపు కార్డులు లభించలేదని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

అలయ్-బలయ్‌లో టీ-జాక్ నేతలు


విజయలక్ష్మితో టీ-జాక్ నేతలు

లాలాపేట: హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు పాల్గొన్నారు. బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె బండారు విజయలక్ష్మిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీ-జాక్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి వారసత్వాన్ని కాపాడి భావితరాలకు అందించడంలో బండారు దత్తాత్రేయ చేస్తున్న అలయ్-బలయ్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ శ్రీరామ్ శివకుమార్, గాదె దయాకర్, యాదాద్రి భువనగిరి జిల్లా జేఏసీ నేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

అదనపు విధులా.. డుమ్మా కొడుతున్నారా ?

- సికింద్రాబాద్ బల్దియాలో నిలిచిపోతున్న పౌర సేవలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో పౌర సేవలు నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు వెలువడింది మొదలు జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం కార్యాలయంతోపాటు సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది కార్యాలయాలకు రాక పలు విభాగాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. అదనపు విధులు, క్షేత్రస్థాయి పర్యటనల పేరిట అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదు. ఏ విభాగానికి వెళ్లి ఆరా తీసినా ఉద్యోగులు, అధికారులు అదనపు ఎన్నికల విధుల పేరుతో కార్యాలయాలకు రావడం మానేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కొందరు అధికారులు, ఉద్యోగులు బదిలీలపై వెళ్లిపోయారు. ఇంకొందరు పదవీ విరమణ చేశారు. ఆయా స్థానాల్లో నియామకాలు జరుగలేదు. ఫలితంగా జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగుల కొరత ఏర్పడింది. కరోనా పరిస్థితుల అనంతరం జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు, అధికారులకు అదనపు పనుల భారం పెరిగిన మాట వాస్తవమే అయినా.. అదనపు విధుల పేరుతో అందుబాటులో ఉన్న పరిమిత సంఖ్యలోని అధికారులు, ఉద్యోగులు విధులకు ఎగనామం పెడుతున్నట్టు సమాచారం. ఫలితంగా పౌర సేవలు ఆసాంతం కుంటుబడుతున్నాయి.

పత్తలేని ప్రత్యామ్నాయం..

వివిధ అవసరాల నిమిత్తం జీహెచ్‌ఎంసీ కార్యాలయం చుట్టూ ప్రజలు పలుమార్లు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. టౌన్‌ప్లానింగ్, పన్నుల విభాగం, ఇంజినీరింగ్ వంటి ప్రధాన విభాగాల అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదని ఆయా అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి సికింద్రాబాద్ సర్కిల్ పరిధి, జనాభా ఎక్కువగా ఉందన్న కారణంతో రెండుగా విభజించి కొత్తగా బేగంపేట సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో సర్కిల్‌ను విభజించినప్పటికీ ఎనిమిదేళ్లుగా ప్రజాసేవల విస్తరణలో రెండు సర్కిల్ కార్యాలయాలు సాధించిన ప్రగతి ఎంత మాత్రం లేదు. సికింద్రాబాద్ నుంచి కొన్ని ప్రాంతాలను వేరుచేసి బేగంపేట సర్కిల్‌ను కొత్తగా ఏర్పాటు చేసిన అధికారులు అందుకు అవసరమైన సిబ్బందిని మాత్రం కేటాయించలేదు. ట్యాక్సు, పట్టణ ప్రణాళిక, జనన, మరణ ధృవీకరణజారీ, వివిధ అభివృద్ధి పనుల విభాగాల్లో ఈ సమస్యలు తీవ్రంగా ఉంటున్నాయి. అదనపు విధులు ఉన్న సందర్భాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదు. అదనపు విధులు ఉన్నప్పటికీ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంగ్రెస్ అధికారంతోనే అన్ని వర్గాలకు న్యాయం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న మర్రి రాఘవయ్య

సికింద్రాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ద.మ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అన్నారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో మాత్రమే పేద, మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ స్థానికుడు, రైల్వే కార్మిక సంఘం నాయకుడిగా ప్రజా సమస్యలు తెలిసిన ఆదం సంతోష్‌కుమార్‌కు ఈ ఎన్నికల్లో లష్కర్ ప్రజలు ఉండగా నిలువాలన్నారు. ఈ ప్రచారంలో ఉమాదేవి, సృజన్, జయరాజు, షకీల్‌ఖాన్, వహీదుద్దీన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మంగళహారతులు..ఆత్మీయ పలకరింపులు


స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: మంగళహారతులతో స్వాగతాలు, ఆత్మీయ పలకరింపులు, గల్లీగల్లీల్లో సత్కారాలు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాదయాత్రలో స్థానికుల నుంచి కురిసిన అభిమాన వర్షం. బుధవారం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని ఆవులమంద, సోమసుందరం వీధి, బర్ధన్ కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ తాను చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటింటికి ఆయనను ఆహ్వానిస్తూ తిలకం దిద్ది మంగళహారతులు పట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలో జరిగిందన్నారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డాక ఎన్నో దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపినట్లు గుర్తు చేశారు. గత కొన్ని దశాబ్దాల కాలంగా చిత్తశుద్ధి లేని నాయకులతోనే సమస్యలు ఎక్కడివక్కడే ఉండిపోయాయన్నారు.పెద్ద పెద్ద పదవులు అనుభవించిన వాళ్లు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి కూడా సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తలసాని సాయి కిరణ్‌యాదవ్, అత్తెల్లి అరుణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, కిరణ్మయి, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, విజయ్, ఆనంద్‌పాటిల్, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మహిళలు

మంత్రికి మద్దతు

సనత్‌నగర్: నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు జెక్‌కాలనీకి చెందిన మహిళలు మద్దతు తెలిపారు. బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసానికి వెళ్ళి ఎన్నికల్లో తాము మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. ఎంతో అభివృద్ధి చేసిన మంత్రిని మరోసారి గెలిపించుకోవడం ద్వారా అభివృద్ధికి ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుందని ఈ సందర్భంగా మహిళలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో హైమ, భాగ్యలత, అమరావతి, హరిత, స్వరూప, సుమ, శ్రీలత, సింధు, జ్యోతి, వాణి, లక్ష్మీ, భారతి ఉన్నారు.

చెడుపై విజయమే రావణ దహనం



లాలాపేట: విజయ దశమిని పురస్కరించుకుని బుధవారం లాలాగూడలో నిర్వహించిన రావణ దహనం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తడక జగదీశ్వర్ గుప్తా ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడుపై మంచి విజయానికి గుర్తింపుగా గత 65 సంవత్సరాలుగా రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



సనత్‌నగర్: కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వప్న నర్సింగ్ హోమ్, నిషాంత్‌బాగ్, కీర్తిలాల్ జ్యువెలర్స్, బాబుఖాన్ మాల్, అమృతమాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 18, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 55, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 23, పందిరి బీర 18, క్యాబేజీ 15, క్యారెట్ 40, దొండ 13, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

దాసారం బస్తీ మైదానం.. పోకిరీలకు నిలయం!

అమీర్‌పేట: రౌడీషీటర్ షరీఫ్ చేతిలో తరుణ్ అనే యువకుడు హత్య చేయబడ్డ సనత్‌నగర్ దాసారం బస్తీలోని మైదానం గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారిపోయిందని స్థానికులు అంటున్నారు. సాయంత్రం అయ్యిందంటే చాలు మైదానంలో మద్యం, గంజాయి తాగుతూ తిష్టవేసి ఇబ్బందులుకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పోలీసుల నిఘా లేకపోవడం కూడా ఓ కారణమని సమీప ప్రాంతాల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు, వివిధ పనులు ముగించుకుని రాత్రి సమయంలో మైదానంలో నుంచి ఇళ్లకు వెళ్లాల్సి వస్తే భయం భయంగా ఉంటుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ తిష్ట వేస్తున్న వారిని ఎవరైనా ప్రశ్నిస్తే మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్నారని బాలయ్యనగర్ కాలనీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. గంజాయి తాగిన యువకులే తరుణ్‌పై బండ రాళ్లతో ఎక్కువ సార్లు దాడులు చేశారని ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలుస్తోంది. ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా ఉండుంటే తరుణ్ ప్రాణాలు పోయేవి కావని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కేపీఎల్ ఎస్‌వై పార్కు, జయప్రకాష్‌నగర్ పార్కు వద్ద సైతం గంజాయి బ్యాచ్‌లు అర్ధరాత్రి వరకు తిష్ట వేస్తున్నారని వారిపై దృష్టి సారించాలన్నారు.

కన్స్యూమర్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రమేష్


నియామకపత్రం అందుకుంటున్న తాండ్ర రమేష్

అడ్డగుట్ట: తెలంగాణ కన్స్యూమర్ రైట్స్ సంస్థ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా శాంతినగర్‌కు చెందిన తాండ్ర రమేష్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, హైదరాబాద్ అధ్యక్షులు మహావీర్ జైన్ చేతుల మీదుగా బుధవారం తాండ్ర రమేష్ నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్థలో కన్స్యూమర్ హక్కుల సాధనకు కష్టపడే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. బాధ్యతలు చేపట్టిన వారందరూ వినియోగదారుల పరిరక్షణకు పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివకుమార్, రాజేష్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ప్రొఫెసర్‌కు లీడర్‌షిప్ అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రొ. ఉమామహేశ్వర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొ.ఉమామహేశ్వర్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ ఇండియా(ఎస్ఏఈ) వార్షిక అవార్డుల కార్యక్రమంలో ఆయనకు లీడర్‌షిప్ అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. ఎస్ఏఈ ఇండియా హైదరాబాద్ డివిజన్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రొ.ఉమా మహేశ్వర్ గతేడాది కూడా ఇదే అవార్డును అందుకోవడం విశేషం.